# 1. ప్రకృతి ధర్మం

“భూమ్యాకాశాలలోని సమస్త చరాచరాలు ఇష్టమున్నా లేకపోయినా దేవునికి లొంగి ఆయన ధర్మానికి కట్టుబడి ఉన్నాయి. చివరికి అందరూ ఆయన దగ్గరికే చేరుకోవలసి ఉంది. అలాంటప్పుడు వీరు దేవుడు పంపిన ధర్మం కాదని వేరే మరోధర్మాన్ని కోరు తున్నారా?” (ఖుర్‌ఆన్-3:83)

“ధర్మస్వీకరణలో ఎలాంటి బలాత్కారం లేదు. సత్యం అసత్యం నుండి స్పష్టంగా వేరు చేయబడింది. కనుక ఇకనుండి మిథ్యాదైవాలను నిరాకరించి అల్లాహ్‌ను విశ్వసించినవాడు ఎన్నటికీ ఏమాత్రం చెక్కుచెదరని దృఢమైన ఆశ్రయం పొందినట్లే.” (ఖుర్‌ఆన్-2:256)

“కనుక (విశ్వాసులారా!) మీరు ఏకాగ్రచిత్తులై ఈ ధర్మాన్నే అంటిపెట్టుకొని ఉండండి. దేవుడు మానవుల్ని ఏ ప్రకృతి(ధర్మం) ఆధారంగా పుట్టించాడో ఆ ప్రకృతి (ధర్మం)లోనే స్థిరంగా ఉండండి. ఆయన రూపొందించిన ప్రకృతికి మార్పులేదు. ఇదే సరైన మార్గం, (సహజ)ధర్మం. కాని చాలామంది (దీన్ని) ఎరుగరు. (మీరు) దేవుని (మార్గం)వైపుకే మరలి ఆయనకు భయపడుతుండండి. నమాజ్ స్థాపించండి. బహుదైవారాధకులతో కలసిపోకండి. వారు తమ ధర్మాన్ని చీల్చుకొని విభిన్న వర్గాలుగా విడిపోయారు. ప్రతివర్గం తన దగ్గరున్న దానిలో (కల్పిత మతాచారాల్లో) నిమగ్నమై ఉంది.” (ఖుర్‌ఆన్-30:30-32)

మహాప్రవక్త మహితోక్తి: “మాతృగర్భం నుండి పుట్టే ప్రతిపిల్లవాడూ ప్రకృతిధర్మం ఆధారంగానే పుడుతున్నాడు. కాని తల్లిదండ్రులు ఆతర్వాత ఆ పిల్లవాడ్ని క్రైస్తవునిగానో, యూదునిగానో, మజూసీగానో లేదా మరో రకం గానో మార్చివేస్తున్నారు. దీన్నీవిధంగా పోల్చవచ్చు- పశువుల కడుపుల్లో నుంచి పశువులు ఎలాంటి లోపంలేకుండా పుడ్తాయి. ఏ జంతుపిల్ల కూడా తెగిన చెవులతో పుట్టదు. ఆతర్వాత బహుదైవారాధకులు తమ మూఢనమ్మ కాలతో దాని చెవులు కోసివేస్తారు.” (బుఖారి)

“ముస్లింలైనా, యూదులైనా, క్రైస్తవులైనా, నక్షత్రారాధకులైనా, మరెవరైనా సరే దేవుడ్ని, అంతిమదినాన్ని విశ్వసించి తదనుగుణంగా సత్కార్యాలు చేస్తుంటే, అలాంటి వారికి (ప్రళయదినాన) ఎలాంటి భయంగాని, దుఃఖంగాని ఉండదు.” (ఖుర్‌ఆన్-5:69)

దేవుడు ఒక్కడే అయినప్పుడు ఆయన చూపే జీవనధర్మం కూడా ఒక్కటే అయిఉండాలి. అంతేగాని కొందరికి ఒక ధర్మం, మరికొందరికి దానికి విరుద్ధంగా ఉండే విషయాలతో కూడిన మరొక ధర్మం నిర్దేశించడు. పరస్పర విరుద్ధ విషయాలతో కూడిన విభిన్న మార్గాలు నిర్దేశించడం అనే విషయం మానవ ఇంగితజ్ఞానానికి కూడా విరుద్ధమే.

దేవుడు మానవాళికి ప్రతి యుగంలోనూ నిర్ణయించిన రుజుమార్గం “ఇస్లాం” మాత్రమే. గత ప్రవక్తలు బోధించిన ధర్మం కూడా ఇస్లాంమే. దీన్నే సన్మార్గం, శాంతిమార్గం, దైవవిధేయతామార్గం అంటారు. రెండు బిందువుల్ని కలిపే సరళరేఖ ఒక్క రేఖ మాత్రమే అవుతుంది. అలాగే దాసుడు దైవాన్ని చేరుకోవడానికుండే అతి దగ్గరిదారి, రుజుమార్గం కూడా ఒక్కటే. మిగిలిన రేఖలన్నీ వక్రరేఖలు, మిగిలిన మార్గాలన్నీ అపమార్గాలు అవుతాయి. వాటిని అనుసరించేవారు పరలోకంలో ఘోరంగా నష్టపోతారు.



ఇహపర లోకాల సాఫల్యానికి హామీ నిచ్చే ఆ మార్గం పేరే “ఇస్లాం.” అదే సరైనమార్గం, సరళమార్గం, శాంతిమార్గం, శ్రేయస్కరమార్గం. ఇదే ప్రకృతిధర్మం, సహజధర్మం. ఇలాంటి మార్గం కాదని వేరేమార్గాలు అవలంబించడం వల్ల పరలోకంలో మోక్షం లభించకపోవడమే గాక శాశ్వతంగా నరకశిక్షలు అనుభవించవలసి వస్తుంది.

“ఒకవేళ మా దాసునిపై అవతరింపజేసిన ఈ (ఖుర్‌ఆన్) గ్రంథం గురించి మీకేదైనా అనుమానముంటే ఇందులోని అధ్యాయం లాంటి ఓ అధ్యాయం రచించి తీసుకురండి. ఈ పని కోసం ఒక్క దేవుడ్ని వదలి మీ మద్దతుదారులందర్నీ పిలుచుకోండి. మీరు సత్యవంతులైతే ఈ పని చేసి చూపండి. మీరీ పని చేయలేకపోతే...ఎంతమాత్రం చేయలేరు... మనుషులు, రాళ్ళు ఇంధనం కాగల నరకాగ్నికి భయపడండి. సత్యతిరస్కారుల కోసం అది సిద్ధపరచబడి ఉంది.” (ఖుర్‌ఆన్-23-24)

## చేతులు కాలాక ఆకులు పట్టుకుంటారా?-1

“అవిశ్వాసులై పోయి, అవిశ్వాసస్థితిలోనే అంతిమశ్వాస విడిచేవారిని దేవుడు, దైవదూతలు, యావత్ మానవులు శపిస్తారు. వారు ఎల్లప్పుడూ శాపగ్రస్తులుగానే ఉంటారు. అలాంటివారికి నరకయాతనలు తగ్గించడంగాని, మరొక అవకాశం ఇవ్వడంగాని ఎట్టి పరిస్థితిలోనూ జరగదు.” (ఖుర్‌ఆన్-2:161,162)

“అవిశ్వాసవైఖరి అవలంబించి, అవిశ్వాసస్థితిలోనే ఊపిరి వదిలేవారు నరకశిక్ష నుండి కాపాడుకోవడానికి భూమండలమంత బంగారం ఇచ్చినా స్వీకరించడం జరగదు. వారికి వ్యథాభరితమైన శిక్ష పడుతుంది. ఇక వారిని ఎవరూ ఆదుకోలేరు.” (ఖుర్‌ఆన్-3:91)

సత్యం దగ్గరికి వచ్చినా దాన్ని విశ్వసించడానికి నిరాకరించినవారు ప్రళయదినాన తీవ్రంగా పశ్చాత్తాపపడతారు. మనిషి ఏవిధంగా శరీరపోషణకు ఏది మంచి పదార్థమో పరికించి స్వీకరిస్తాడో, అదేవిధంగా ఆత్మవికాసం కోసం కూడా ఏదిసత్యమో, ఏది నిజధర్మమో పరిశీలించి స్వీకరించవలసి ఉంటుంది. మంచి ఏదో, చెడు ఏదో, సత్యమేదో, అసత్య మేదో మనిషికి అతని అంతరాత్మే చెబుతుంది. అతను తన అంతరాత్మ ప్రబోధన వినకుండా దాన్ని నొక్కిపెట్టి అపమార్గంలోనే పడివుంటే, మరణానంతరం పరలోకంలో కుమిలికుమిలి ఏడ్వవలసివస్తుంది. చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం బుద్ధిమంతుల లక్షణం కాదు.

“అసలు వాగ్దానం నెరవేరే సమయం త్వరలోనే ఆసన్నమవుతుంది. అప్పుడు హఠాత్తుగా సత్యతిరస్కారులకు నిలువుగుడ్లు పడతాయి. వారు (తమను తాము నిందించుకుంటూ) ‘అయ్యయ్యో! మా పాడుగాను, మేమెంత ఏమరుపాటులో పడివున్నాం!! (కాదు) మేమసలు పాపాత్ములం’ అంటారు.” (ఖుర్‌ఆన్-21:97)

## నరకవాసుల అవస్థలు-2

“దుష్కార్యాలుచేసేవారికి వారి దుష్కార్యాలకు తగినట్లే దుష్ఫలం ఉంది. వారిని అవమానం, అప్రతిష్ఠలు చుట్టుముడ్తాయి. దేవుని పట్టు నుండి వారిని కాపాడే నాథుడే ఉండడు. వారి ముఖాలు (నిరాశా నిస్పృహలతో) కారు చీకటిలా నల్లగా మాడిపోయి ఉంటాయి. వారే నరకానికిపోయేవారు. నరకంలోనే ఎల్లకాలం పడిఉంటారు.” (ఖుర్‌ఆన్-10:27)

“నరకాగ్ని వారి ముఖచర్మాన్ని మాడ్చివేస్తుంది. దాంతో వారి పళ్ళు, దవడలు బయటికి వస్తాయి.” (ఖుర్ఆన్–23:104)

హదీసుల్లో కూడా నరకవాసుల వికృత రూపాలను గురించి ప్రస్తావన ఉంది. దైవప్రవక్త (సల్లం) ఈ విషయాన్ని గురించి ఇలా తెలియజేశారు :

“నరకవాసి నిప్పులో కాలడంవల్ల అతని పైపెదవి కురుచైపోయి తలలో అర్ధభాగం దాకా పోతుంది. క్రిందిపెదవి బొడ్డుదాకా జారి వ్రేలాడుతూ ఉంటుంది.” (తిర్మిజి)

అబ్దుల్లా బిన్ అమ్ర్ (రజి) కథనం: “నరకవాసుల్లో ఎవరినైనా ఒకడ్ని భూలోకానికి పంపిస్తే ఎంతో వికృతమైన అతని భయంకర స్వరూపం, అతని శరీరం నుండి వెలువడే దుర్వాసనల కారణంగా భూలోకవాసులు తప్పకుండా చచ్చిపోతారు.” ఆయన ఈమాట చెప్పి ఎంతగానో దుఃఖించారు. (తర్గీబ్)

**రక్తకన్నీరు–** హజ్రత్ అనస్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఓసారి అనుచరులతో ఇలా అన్నారు: “సోదరులారా! (నరకయాతనలను తలచుకొని) ఏడ్వండి. ఏడ్వడం చాతకాకపోతే కనీసం ఏడ్పుముఖమైనా పెట్టుకోండి. నరకంలో నరకవాసి అతి ఘోరంగా ఏడుస్తాడు. అతని కళ్ళ నుంచి నీటిధారలు వరదలై పారుతాయి. అలా ఏడుస్తూ నీటిధారలు ఆగిపోయి రక్తకన్నీరు పారుతుంది. (రక్తకన్నీరు కూడా వరదలై పారుతుంది.) దాంతో అతని కళ్ళు పచ్చిపుండ్లయి పోతాయి. నరకవాసి కళ్ళనుంచి పారే ఈ నీటి, రక్తపు కాలువల్లో గనక పడవలు వదిలితే అవి నిక్షేపంగా నడుస్తాయి.” (షరాసున్న)

## మాటలకు, చేతలకు పొంతన ఏదీ?–3

ఇస్లాం ధర్మం విశ్వసించగానే మనిషి ముస్లిం అయిపోతాడు. అయితే కేవలం ఇస్లాంను విశ్వసించినంత మాత్రాన అతను నేరుగా స్వర్గానికి పోలేడు. జీవిత సమస్త రంగాల్లో ఇస్లాం బోధించే విషయాల ప్రకారం జీవితాంతం నడచుకోవలసి ఉంటుంది. విశ్వాసానికి, ఆచరణకు; మాటలకు, చేతలకు మధ్య వైరుధ్యాన్ని ఇస్లాం ఏమాత్రం సహించదు.

ధర్మానికి ఆధారం విశ్వాసం అయితే, విశ్వాసానికి దర్పణం ఆచరణ అవుతుంది. ఆచరణ ద్వారానే విశ్వాసం బహిర్గతమవుతుంది. దేవుణ్ణి, ఆయన ప్రవక్త (స)ను విశ్వసించామని చెప్పుకునే ముస్లింలు దేవుని ఆజ్ఞలను, ఆయన ప్రవక్త ప్రవచనాలను పాటిస్తున్నప్పుడే వారి విశ్వాసానికి గుర్తింపు లభిస్తుంది.

దైవప్రవక్త (స) ప్రవచనం: “దేవుడు విశ్వాసంలేని సదాచరణను, సదాచరణలేని విశ్వాసాన్ని (ఎన్నటికీ) స్వీకరించడు.” (ఇస్లామీ నజర్యా– ప్రొఫెసర్ ఖుర్షీద్ అహ్మద్)

చెట్టు మొలకెత్తి పెరగడానికి విత్తనం ఎంత ముఖ్యమో ఆచరణకు విశ్వాసం కూడా అంతే ముఖ్యం. విద్యుచ్ఛక్తి గురించి తెలియని బాలుడు ఇనుపకడ్డీతో హైటెన్షన్ వైర్ల మీద పడిన గాలిపటం తీసుకోడానికి ప్రయత్నిస్తే కరెంట్ షాక్కొడ్తుంది. నిప్పుసంగతి తెలియని పసిపిల్లవాడు వెలుగుతున్న కొవ్వొత్తి పట్టుకుంటే చెయ్యి కాలుతుంది. కాని కరెంటుకు షాక్కొట్టే గుణం, నిప్పుకు కాల్చేగుణం ఉన్నాయని పెద్దవాళ్ళు నమ్ముతారు. అంచేత వారు పసిపిల్లల్లా, పిచ్చివాళ్ళులా, మూర్ఖుల్లా ప్రవర్తించి ప్రమాదం కొనితెచ్చుకోరు.



అదేవిధంగా దేవుడు, దివ్యావిష్కృతి, మరణానంతర జీవితం గురించిన విషయాల్ని కూడా మంచీ–చెడూ, విజ్ఞతా–వివేచనలు కలిగిన మానవుడు విశ్వసించి తదనుగుణంగా నడచుకుంటే, అతను ఇటు ఇహ లోకంలోనూ సుఖవంతమైన జీవితం గడుపుతాడు, అటు పరలోకంలోనూ శాశ్వత సౌఖ్యాలు అనుభవించగలడు.

విశ్వాసాలే ఆచరణలకు ఆధారాలు. ఆచరణలేని విశ్వాసం నిరర్థకం. దేవుని ఆజ్ఞల్ని, ఆయన ప్రవక్త (స) బోధనలను ఆచరించకుండా వారుభ యుల్ని విశ్వాసించానని చెప్పుకోవడం ‘తోటలో ఒక్క చెట్టు కూడా మొలకెత్తకపోయినా యజమాని ఇచ్చిన విత్తనాలన్నీ నాటానని వాదించడం లాంటిదే. ఇస్లాం స్వీకరించిన మనిషి ఇస్లాంకు అనుగుణమైన జీవితం గడపడం వల్లనే పరలోకంలో మోక్షం పొందగలుగుతాడు.

## షిర్క్ (దైవేతరశక్తుల ఆరాధన)–4

మానవుడు బలహీనుడిగా పుట్టించబడ్డాడు. అతని వల్ల పాపాలు జరగడం ఆశ్చర్యకరమైన విషయంకాదు. ఇస్లాంను మనస్ఫూర్తిగా విశ్వసించిన మనిషివల్ల కూడా పాపాలు జరిగి పోతాయి. దేవుడు ఎంతో దయామయుడు. ఆయన గొప్ప క్షమాగుణం కలవాడు. పాపం చేసిన విశ్వాసి తన జీవితకాలంలోనే దేవుని సన్నిధిలో తన పాపాలకు క్షమాపణ చెప్పుకొని, తిరిగి వాటి జోలికి పోకుండా సాత్విక జీవితం గడిపితే ఆయన తప్పకుండా క్షమిస్తాడు.

అయితే మనిషి తన ఐహికజీవితంలో క్షమాపణ చెప్పుకోకుండా వదిలేసిన ఒక పాపాన్ని మాత్రం దేవుడు ఎలాంటి పరిస్థితిలో కూడా క్షమించడు. ఆ పాపాన్నే ‘షిర్క్’ అంటారు. షిర్క్ చాలా విస్తృతభావంతో కూడిన పదం. దైవేతరుల్ని పూజించడం మాత్రమే షిర్క్ కాదు. మనిషి జీవిత సమస్తరంగాల్లో దేవుడు స్పష్టంగా జారీచేసిన ఆజ్ఞల్ని త్రోసిపుచ్చి మనోవాంఛలకు దాసుడై తనకిష్టమైన పని చేయడాన్ని, లేక దైవేతరుల ఆజ్ఞల్ని పాటించడాన్ని షిర్క్ అంటారు.

అన్నిటికంటే ఘోరమైన పాపకార్యం ఏదైనా ఉందంటే అది దేవునికి సాటికల్పించడమే. దీన్నే ‘షిర్క్’ (బహుదైవారాధన) అంటారు. ఏకేశ్వరుని దైవత్వాన్ని దైవేతర శక్తులకు ఆపాదించడం, అందులో దైవేతరులకు భాగం కల్పించడం, ఆ దేవునికున్న గుణగణాలు, శక్తిసామర్థ్యాలన్నీ లేదా వాటిలో కొన్ని దైవేతర శక్తులక్కూడా ఉన్నాయని నమ్మడం, తదనుగుణంగా నడచుకోవడం మొదలైనవన్నీ షిర్క్ కిందికే వస్తాయి.

అంతేకాదు, ఖుర్ఆన్, హదీసుల్లో విధిగా చేయబడిన ఏ ఆజ్ఞకు వ్యతిరేకంగా నడచుకున్నా అది కూడా షిర్క్ కిందికే వస్తుంది. ఒక ముస్లిం దైవాజ్ఞకు వ్యతిరేకంగా నడచుకున్నాడంటే అతను ఏదో ఒక మిథ్యాదైవం ఇచ్చిన ఆజ్ఞను పాటించాడని అర్థం. మిథ్యాదైవాల ఆజ్ఞల్ని పాటించడం మిథ్యాదైవాల ఆరాధన (షిర్క్) కిందికే వస్తుంది.

“దేవుడు తనకు సాటి కల్పించడాన్ని ఎట్టి పరిస్థితిలోనూ క్షమించడు. అది తప్ప ఇతర పాపాలను ఆయన తలచుకుంటే క్షమిస్తాడు. దేవునికి సాటి కల్పించడమంటే ఘోరమైన పాపం మూట కట్టుకున్నట్లే.” (ఖుర్ఆన్–4:48)

(షిర్క్ గురించి వివరంగా తెలుసుకోదలచినవారు “ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్” నుండి వెలువడిన “ఏక దైవారాధన” అనే పుస్తకం చదవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.)